క్లుప్తంగా

ఆలయ కమిటీ ఏర్పాటుపై వివాదం

కొయ్యలగూడెం : గొలగమూడి వెంకయ్య అవధూత స్వామి ఆలయ పాలక మండలి నూతన కమిటీ ప్రమాణ స్వీకారం గురువారం వివాదాస్పదంగా మారింది. ఉదయం కమిటీ ప్రమాణ స్వీకారాన్ని వ్యతిరేకిస్తూ కొందరు భక్తులు నిరసన వ్యక్తం చేసి ఆలయ ప్రవేశ ద్వారానికి తాళం వేయడంతో గొడవ రాజుకుంది. ఇప్పటివరకు బాధ్యతలు నిర్వహిస్తున్న సభ్యులు రెండు గ్రూపులుగా విడిపోయి ఘర్షణకు దిగారు. రెండు రోజులలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని పెద్దలు సూచించడంతో వివాదం సద్దుమణిగింది.

బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యం

జంగారెడ్డిగూడెం : పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా అన్నారు. జంగారెడ్డిగూడెం 9వ సచివాలయం పరిధిలోని 20, 21 వార్డుల్లో గురువారం 184వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎలీజా ఈ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ పర్యటించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల ప్రభుత్వ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన అందించారన్నారు. అర్హత గల అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తుండడంతో ప్రజలంతా సీఎం వైఎస్ జగన్‌ను ఎంతో మెచ్చుకుంటున్నారన్నారు. నవరత్నాల పథకాలతో ప్రతి ఇంటా లబ్ధి చేకూరడమే కాకుండా ఎన్నో ఏళ్లగా గృహాలు లేక ఇబ్బందులు ఎదుర్కొన్న నిరుపేదలకు సొంతింటి కల నెరవేరడంతో ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని అన్నారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రిగా కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న సంక్షేమ పాలనను చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక లేనిపోని విమర్శలకు పాల్పడుతున్నాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు, టీడీపీ నేతలు చెప్పిన వారికే సంక్షేమ పథకాలు అందేవని, కానీ నేడు అర్హులైన ప్రతి ఒక్కరికీ మధ్యవర్తిత్వం లేకుండా వలంటీర్లు, సచివాలయ వ్యవస్థల ద్వారా నేరుగా పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, ఐసీడీఎస్ రీజనల్ చైర్మన్ వందనపు సాయిబాల పద్మ, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు పడమటి గిరిబాబు గౌడ్, వైస్ చైర్మన్‌లు ముప్పిడి అంజి, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షులు పీపీఎన్ చంద్రరావు, స్థానిక కౌన్సిలర్లు కఠారి వాసు, కంచర్ల గీతాకుమారి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అక్బర్, నాయకులు బత్తిన చిన్న, వందనపు వెంకటేశ్వరరావు, కంచర్ల విష్ణు, సంజయ్ గౌడ్, పంది రాజా, కౌన్సిలర్లు, మున్సిపల్ మేనేజర్ కేవీ రమణ, డీటీ రమేష్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం : బుక్‌లెట్ అందిస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా



పోలవరం రూరల్ : వింజరంలో బుక్‌లెట్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

రాజకీయాలకతీతంగా సంక్షేమ లబ్ధి

పోలవరం రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. పోలవరం మండలం వింజరం గ్రామంలోని సచివాలయం పరిధిలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే బాలరాజు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి కుటుంబానికి అందిన లబ్ధిని చదివి వివరించి, బుక్‌లెట్‌లను అందజేశారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకుందామన్నారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు చెప్పిన పలు సమస్యలను సాదరంగా విని, వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. తొలుత ఎమ్మెల్యే బాలరాజుకు గ్రామస్తులు పూలబొకేలతో స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఆ ప్రాంతంలో మొక్కలు కూడా నాటారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని సూచించారు. వింజరం జంక్షన్ నుంచి వెంకటరెడ్డిగూడెం గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కొబ్బరి కాయకొట్టి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, జెడ్పీటీసీ కలుం హేమకుమారి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు బుగ్గా మురళీకృష్ణ, వింజరం సర్పంచ్ కొక్కెర వెంకటలక్ష్మి, చేగొండిపల్లి సర్పంచ్ జారం సీతారామలక్ష్మి, సున్నం గంగాజలం, తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీవో జి.శ్రీను, పలు శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరిపై కేసు నమోదు

ద్వారకాతిరుమల: మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై టి.సుధీర్ చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కామవరపుకోట మండలం కొత్తూరు గ్రామానికి చెందిన పొగడాల నాగమణి వెంట్రుకల వ్యాపారం చేసుకుంటూ జీవిస్తోంది. ఈ క్రమంలోనే ఈ ఏడాది జూన్ 19న మధ్యాహ్నం మండలంలోని గొల్లగూడెంలో ఆమె వెంట్రుకల వ్యాపారం చేస్తోంది. ఆ సమయంలో అక్కడికొచ్చిన కామవరపుకోటకు చెందిన వజ్రగిరి తిరుపతయ్య, వజ్రగిరి రాంబాబు పాతకక్షల నేపథ్యంలో నాగమణిని వెనుక నుంచి పట్టుకుని, అసభ్యకరంగా ప్రవర్తించారు. కేకలు విని ఆమె భర్త అక్కడికి రావడంతో, నిందితులు ఆమెను పక్కకు పడవేసి అక్కడి నుంచి పరారయ్యారు. దీనిపై పెద్దల వద్ద పంచాయితీ పెట్టినా తేలలేదు. దీంతో బాధితురాలు గురువారం పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ద్వారకాతిరుమల: ఒక వ్యక్తి అదృశ్యంపై గురువారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. వివరాల ప్రకారం. మండలంలోని పంగిడిగూడెంకు చెందిన కొనాల యేసురత్నం ఈ ఏడాది మే 27న తన భార్య స్వాతికి ఫోన్ చేసి, తనకు కమతం పని కుదిరిందని, నెలరోజుల వరకు ఇంటికి రానని, కంగారు పడొద్దని చెప్పాడు. అయితే ఆ తరువాత నుంచి యేసురత్నం ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తోంది. దీంతో స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

సాగు భూములకు పట్టాలివ్వాలి

టి.నరసాపురం : తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని మండలంలోని ఏఎస్‌ఆర్ నగర్ ప్రాంతవాసులు డిమాండ్‌చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు హనుమాన్ మురళి మాట్లాడుతూ 2010 నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ మైనార్టీలు సర్వే నెంబర్ 86లో ఉన్న భూముల్లో మినుములు, కందులు, పత్తి వంటి పంటలు పోడు వ్యవసాయం చేస్తున్నారన్నారు. ఈ భూములకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అసైన్‌మెంట్ సవరణ ఆర్డనెన్స్ ప్రకారం పట్టాలివ్వాలన్నారు. అలాగే ఏఎస్‌ఆర్ నగర్‌లో మౌలిక వసతులు, విద్యుత్, మంచినీళ్లు, ఇళ్ల పట్టాలివ్వాలని కోరారు.

దొంగనోట్ల కేసులో ఇద్దరి అరెస్టు

జంగారెడ్డిగూడెం: దొంగనోట్లు చలామణి చేస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఎస్పీ మేరి ప్రశాంతి ఆదేశాల మేరకు ఎస్సై ఎం.సాగర్‌బాబు, ఎస్‌బీ హెచ్‌సీ రాజు, సిబ్బంది గురువారం రాత్రి కారులో వెంబడించి స్థానిక శ్రీనివాసపురం జంక్షన్‌లో నిందితులను అదుపులోకి తీసుకున్నారని సమాచారం. వీరి నుంచి రూ.50 లక్షల నగదు, కారు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

కొయ్యలగూడెం : పొంగుటూరు గ్రామంలోని ఓ నివాసంలో అక్రమంగా నిలువ చేసి ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ టి.శ్రీనివాస్ గురువారం పేర్కొన్నారు. కన్నాయిగూడెం రోడ్డులో నివాసం ఉంటున్న బూరుగు వెంకటేశ్వరరావుకి చెందిన కిరాణా జనరల్ స్టోర్‌లో మూడు క్వింటాళ్ల బియ్యం అక్రమ నిల్వలను గుర్తించి కేసు నమోదు చేశామన్నారు. పట్టుకున్న బియ్యం విలువ రూ.5400 వరకు ఉంటుందని అన్నారు. పి.ఏసుబాబు, వీఆర్వో సీహెచ్ కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం

అమరవీరులను స్మరించుకోవాలి

పోలవరం రూరల్ : దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరించుకోవాలని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. పోలవరం మండలం వింజరం గ్రామంలో నా భూమి, నా దేశం , నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం సెల్ఫీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దేశం కోసం త్యాగం చేసిన అమరవీరుల కోసం మౌనం పాటించారు. అనంతరం మొక్కలను నాటారు. మండలంలోని బోడిగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులతో కలిసి మాట్లాడుతూ జగన్ మామయ్య అందిస్తున్న విద్యాసామగ్రి, అమ్మ ఒడి పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకుని మంచి పేరు తెచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, జెడ్పీటీసీ కలం హేమకుమారి, మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ, సర్పంచ్ కొక్కెర వెంకటలక్ష్మి, ఎంపీటీసీ కుంజం చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : మండలంలోని వల్లంపట్ల, అల్లంచర్ల రాజుపాలెం మక్కినవారిగూడెం, తెడ్లం గ్రామ పంచాయతీలలో గురువారం నా భూమి నా దేశం కార్యక్రమం నిర్వహించారు. వల్లంపట్లలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సామంతపూడి బాలసూర్యనారాయణ రాజు మాట్లాడుతూ దేశ నాయకుల స్ఫూర్తిని అందిపుచ్చుకొని దేశ ఖ్యాతిని ప్రపంచాలకు తెలియజేయాలని యువతకు పిలుపునిచ్చారు. నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం, ప్రతిజ్ఞ అనంతరం వల్లంపట్లలో మొక్కలు నాటారు.

కొయ్యలగూడెం : రాజవరం గ్రామంలో నా భూమి - నా దేశం , నేల తల్లికి నమస్కారం -వీరులకు వందనం కార్యక్రమం రాష్ట్ర సర్పంచుల ఛాంబర్ ఉపాధ్యక్షుడు ఏలేటి చిన తుక్కయ్య అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి పాల్గొని మట్టితో తయారు చేసిన ప్రమిదలను వెలిగించి అమరవీరులకు ఏర్పాటు చేసిన శిలాఫలకం దగ్గర వందనం చేశారు.

బుట్టాయగూడెం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నా భూమి – నా దేశం, నేలతల్లికి నమస్కారం – వీరులకు వందనం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అమృత సరోవర్లు నీటి వనరుల శాఖ జ్ఞాపక శిలాఫలకాల చుట్టూ మట్టి దీపాలను వెలిగించారు. అనంతరం ఎంపీడీఓ ఎస్. వేణుగోపాల్‌రెడ్డి పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా మండలంలోని పలు గ్రామ సచివాలయ పరిధిలో కూడా ఈ కార్యక్రమం జరిగింది.



వింజరంలో అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తదితరులు

నిర్వాసితుల నుంచి వినతుల స్వీకరణ

కుక్కునూరు : ఇటీవల వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గొమ్ముగూడెం గ్రామస్తులు పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటనలో ప్రజలు మొరపెట్టుకున్న సమస్యల విషయమై అర్జీలను స్వీకరించేందుకు గురువారం ఐటీడీఏ పీవో సూర్యతేజ రావికుంట ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి వచ్చారు. కాలనీలో గొమ్ముగూడెం నిర్వాసితుల సమస్యలను తెలుసుకుని వారి వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కాగా ఆర్‌అండ్‌ఆర్‌కు సంబంధించి 18 సంవత్సరాలు నిండిన వారికి ఆర్‌అండ్‌ఆర్ పరిహారం ఇవ్వాలని కోరుతూ, సదరన్ సర్టిఫికెట్‌ల విషయమై ఎక్కువగా గ్రామస్తులు దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ డీఎల్ ప్రమద్వర చెప్పారు.

నులిపురుగు నివారణతో రక్తహీనత దూరం

చింతలపూడి : శరీరంలో ఉండే నులి పురుగుల నివారణతో రక్తహీనత సమస్యను పరిష్కరించుకోవచ్చునని ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్‌కే అబ్రార్ హుస్సేన్ అన్నారు. మండలంలోని ప్రగడవరం జెడ్పీ హైస్కూల్‌లో గురువారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. చేతులు శుభ్రపరుచుకుని పరిశుభ్రమైన ఆహార పదార్థాలు తీసుకోవడం ద్వారా శరీరంలోకి నులి పురుగులు చేరకుండా కాపాడుకోవచ్చునన్నారు. ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజోల్ మాత్రలు మింగాలని చెప్పారు. ఎంఎల్‌హెచ్‌పీ భరత్ కుమార్ విద్యార్థులకు చేతుల శుభ్రతకు పాటించాల్సిన సూత్రాలను సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పిట్టా వేణు, తూము రమేష్, నర్మదా రాణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ

కొయ్యలగూడెం : నులిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం బయ్యన్నగూడెం పీహెచ్‌సీ పరిధిలో వైద్యాధికారులు కె.విజయ కృష్ణ, వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు, చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ పరిధిలోని ఉన్న గ్రామాల్లో 24 పాఠశాలలు, 30 అంగన్‌వాడీ కేంద్రాల్లోని 6014 మంది విద్యార్థులకుగాను 5940 మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశామని 98 శాతం పూర్తయింది అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లింగిశెట్టి అనంతలక్ష్మి, ఉప సర్పంచ్ కోరుకొండ లలిత, ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



బయ్యనగూడెంలో నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్య అధికారులు

పట్టణాభివృద్ధికి సమన్వయంతో పనిచేద్దాం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణ అభివృద్ధికి పాలకవర్గం, అధికారులు సమన్వయంతో పనిచేద్దామని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అలాగే ప్రజాసహకారం ఎంతో అవసరం అన్నారు. సమావేశంలో కౌన్సిల్ సభ్యులు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వైస్ చైర్మన్ ముప్పిడి అంజి మాట్లాడుతూ పామాయిల్ కర్మాగారం నుంచి వ్యర్థాలు పట్టణంలో ప్రవేశించడం వల్ల భూగర్భజలాలు కలుషితం అవుతున్నాయన్నారు. దీంతో మంచినీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలిపారు. అలాగే పలువురు సభ్యులు కూడా పామాయిల్ వ్యర్థాలపై ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ పి.భవానీ ప్రసాద్ మాట్లాడుతూ పామాయిల్ కర్మాగారం వ్యర్థాలపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు రాశామని చెప్పారు. అలాగే త్వరలోనే పన్నులపై సమీక్షిస్తామన్నారు. 19వ వార్డు సభ్యురాలు ప్రియదర్శిని మాట్లాడుతూ తన వార్డులో పాఠశాలకు సమీపంలో వినియోగంలో లేని ఓపెన్ బోర్లు ఉన్నాయని, ఆ బోర్లను శాశ్వతంగా మూసివేయాలని గత సమావేశంలో కోరినప్పటికీ నేటికీ చర్యలు తీసుకోలేదని నిలదీశారు. దీంతో ఏఈ సంధ్య మాట్లాడుతూ వెంటనే శాశ్వతంగా ఓపెన్ బోర్లను మూసివేస్తామన్నారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. పట్టణంలోని పలు వార్డుల్లో సాధారణ నిధులు రూ.3.09 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు నిర్మించాలని సమావేశం తీర్మానించింది. ఫిష్ ఆంధ్ర హబ్‌కు మున్సిపల్ అధీనంలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా 2 సెంట్ల స్థలాన్ని లీజుకు ఇచ్చేందుకు, 29వ వార్డులో డ్వాక్రా మల్టీపర్పస్ హాల్ ఆధునికీకరణకు రూ.10 లక్షల నిధులు కేటాయింపు అంశాలను ఆమోదించింది. అలాగే 21, 22, 23, 24 వార్డుల పరిధిలోని సాలిపేట రోడ్డు నిర్మాణానికి రూ.70 లక్షలతో టెండర్లు ఖరారు చేశారు. 9వ వార్డు బాట గంగానమ్మ లేఅవుట్ కాలనీ వద్ద రూ.నాలుగు లక్షల వ్యయంతో మంచి నీటి పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని, 9వ వార్డు సాయిబాలాజీ నగర్‌లో వెట్ మిక్స్ రోడ్ వేసేందుకు రూ.5 లక్షల నిధులు కేటాయిస్తూ తీర్మానించారు.



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

ఘనంగా శంకరంబాడి సుందరాచారి జయంతి

కామవరపుకోట : రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు అధ్యక్షతన తెలుగు రచయిత శంకరంబాడి సుందరాచారి జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. సుందరాచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు బిరుదుగడ్డ నాగేశ్వరరావు మాట్లాడుతూ సుందరాచారి ప్రీతి పాత్రమైన కవిత ప్రక్రియ, పద్యాలలోని తేటగీతి తెలుగు పాఠకులను ఆకట్టుకుంటుందని తెలిపారు. రాష్ట్ర గీతమైన మా తెలుగు తల్లికి మల్లె పూదండ గీతాన్ని తెలుగు ప్రజలకు అందించిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. ఆయన తెలుగు సాహిత్యానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నల్లమోతుల సత్యనారాయణ, సతీష్ కుమార్, పల్లాలు, రాములు, రమేష్, మురళి, దేవప్రియం, విజయ కుమారి, ప్రియాంక, జయశ్రీ ,గీతాదేవి పాల్గొన్నారు.



సుందరాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు







గ్రామాల్లో ఉప ఎన్నికల కోలాహలం

ద్వారకాతిరుమల: పంచాయతీ వార్డు సభ్యుల ఉప ఎన్నికలతో గ్రామాల్లో సందడి నెలకొంది. నామినేషన్లు వేసేందుకు గురువారం ఆఖరి రోజు కావడంతో ఆయా పంచాయతీ కార్యాలయాల వద్ద పండుగ వాతావరణం కనిపించింది. మండల పరిధిలోని రెండు గ్రామాల్లో ఖాళీ అయిన రెండు వార్డులకు ఈ ఉప ఎన్నికలు జరుగనున్నాయి. ద్వారకాతిరుమలలోని 8వ వార్డు సభ్యుడు నడికట్టు ప్రసాద్ అనారోగ్యంతో కొద్ది నెలల క్రితం మృతి చెందాడు. అలాగే గుణ్ణంపల్లిలోని 6వ వార్డు సభ్యురాలు పెద్దేహపు శిరీష తన పదవికి రాజీనామా చేసి, ప్రస్తుతం వలంటీర్‌గా పనిచేస్తోంది. దీంతో ఖాళీ అయిన ఆ రెండు వార్డులకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. అందులో భాగంగా ద్వారకాతిరుమల 8వ వార్డుకి పెద్దింటి కిరణ్‌కుమార్, పెద్దింటి నాగేశ్వరరావు, మటపర్తి రూపేష్ కుమార్(బద్రి), చిలుకూరి చంద్రశేఖర్, నడికట్టి హేమ, నడికట్టి సీతారామాంజనేయులు, పడవల మోహన్‌బాబు (మొత్తం 8 మంది), అలాగే గుణ్ణంపల్లిలో 6వ వార్డుకి ముసల నాగ రేణుక, సర్నాల వెంకటలక్ష్మి, కేసిరెడ్డి శ్రీదేవి (మొత్తం ముగ్గురు) తమ నామినేషన్లను దాఖలు చేశారు. ఈనెల 11న ఆ నామినేషన్ల పరిశీలన, 14న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. ఆ తరువాత ఎందరు అభ్యర్థులు పోటీలో ఉంటారనేది స్పష్టమౌతుంది. 19న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 2 నుంచి ఓట్లు లెక్కింపు జరిపి, ఫలితాలను వెల్లడిస్తారు.


ద్వారకాతిరుమలలో నామినేషన్ పత్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేస్తున్న కిరణ్‌కుమార్

వీరిశెట్టిగూడెంలో...

కామవరపుకోట : మండలంలో తాడిచెర్ల పంచాయతీకి చెందిన ఒకటవ వార్డు ఎస్టీ రిజర్వ్ వార్డు కావడంతో అక్కడ ఎస్టీలు లేని కారణంగా ఎవరూ నామినేషన్ దాఖలు చేయలేదు. వీరిశెట్టిగూడెం గ్రామ పంచాయతీకి చెందిన మూడో వార్డు సభ్యుడు పాలా కోటేశ్వరరావు మృతి చెందటంతో ఆ వార్డుకు ఎన్నిక నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ సీపీ తరపున పాలా వెంకటేశ్వరరావు, టీడీపీ తరపున కొప్పిసెట్టి నరసింహారావు నామినేషన్ దాఖలు చేశారు. వీరిశెట్టిగూడెం గ్రామ సచివాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యామసుందరకు నామినేషన్లు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవరపల్లి రామ్మోహన్‌రావు, ఎంపీటీసీ బొప్పన చైతన్యకుమార్, తడికలపూడి సొసైటీ చైర్మన్ గుర్రాల రవికుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పోలవరంలో 8 నామినేషన్లు

పోలవరం రూరల్ : పోలవరం మండలంలోని మూడు పంచాయతీల్లో వార్డు మెంబర్ల ఎన్నికలకు సంబంధించి 8 నామినేషన్‌లు అందినట్లు ఎంపీడీవో జి.శ్రీను తెలిపారు. చేగొండిపల్లి వార్డు సభ్యుడికి సంబంధించి 5 నామినేషన్‌లు, గడ్డపల్లి 1, కొరుటూరు 2 నామినేషన్‌లు అందినట్లు తెలిపారు.

శ్రీనివాసపురం సర్పంచ్ ఎన్నికకు 4 నామినేషన్లు

జంగారెడ్డిగూడెం రూరల్ : జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం పంచాయతీ సర్పంచ్ ఎన్నికకు సచివాలయంలో గురువారం నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం జరిగింది. మొత్తం నాలుగు నామినేషన్లు దాఖలుకాగా, వైఎస్సార్ కాంగ్రెస్ తరపున యడ్లపల్లి రాధిక, యడ్లపల్లి సత్యవతి, టీడీపీ తరఫున జొన్నకూటి శ్రీనివాసరావు, తడికల మోహనబాబు నామినేషన్లు వేశారు. అభ్యర్థులు నామినేషన్ల పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.సురేష్‌కి అందజేశారు. ఈనెల 11న పరిశీలన, 14న ఉపసంహరణ, 19 ఎన్నికలు జరుగుతాయని సురేష్ తెలిపారు. శ్రీనివాసపురం పంచాయతీలో మొత్తం 3,657 ఓటర్లు ఉండగా వీరిలో 1,804 పురుషులు,, 1852 మహిళలు, ఇతరులు ఒకరు ఉన్నారని, వార్డులు 12 అని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సురేష్ తెలిపారు. ఈ పంచాయతీలో సర్పంచ్ యడ్లపల్లి దుర్గారావు అనారోగ్యంతో మృతి చెందడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. దుర్గారావు సతీమణి రాధిక సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు.

నేడు పోలవరం ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం


చైర్‌పర్సన్‌గా శాంత కుమారి


ఉపాధ్యక్షుడిగా తాడిగడప రామకృష్ణ

కొయ్యలగూడెం : పోలవరం అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకరణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఏఎంసీ సెక్రటరీ పీవీఎస్ఎస్ సుబ్బరాజు పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు జంగారెడ్డిగూడెం రోడ్డులోని అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అధ్యక్షత వహించనున్నట్లు తెలిపారు. ఏఎంసీ చైర్‌పర్సన్‌గా ఆరేటి శాంతకుమారి(బుట్టాయిగూడెం), ఉపాధ్యక్షులుగా తాడిగడప రామకృష్ణ (కొయ్యలగూడెం మండలం అంకాలగూడెం)లతో సహా 17 మంది డైరెక్టర్లచే ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. ముఖ్యఅతిథులుగా ఏలూరు జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, ఎమ్మెల్యే ఆళ్ల నాని హాజరవుతున్నట్లు తెలిపారు.

రెడ్డిగణపవరంలో భూసర్వే ప్రారంభం

బుట్టాయగూడెం : రెడ్డిగణపవరంలో గురువారం డ్రోన్ భూసర్వే పనులు ప్రారంభమయ్యాయి. ఉపసర్పంచ్ భౌమరాజు సత్యనారాయణ రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు కణితి దుర్గారావు, రైతుల సమక్షంలో ఈ సర్వే పనులను రెవెన్యూ అధికారులు ప్రారంభించారు. సమగ్రమైన భూసర్వే నిర్వహించి రైతులకు పట్టాలు అందజేస్తామన్నారు.























